సాక్షి
కర్నూలు
మంగళవారం • 15 • ఆగస్టు • 2023



అన్నదాన పథకానికి విరాళం
శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి హైదరాబాద్‌కు చెందిన మాగంటి జనార్దన యాదవ్ రూ.1,00,116 విరాళంగా అందజేశారు.



'బయో' దుకాణాలపై విజి'లెన్స్'
విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు బయో పెస్టిసైడ్స్ దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. పలు కారణాలతో కొన్ని మందుల విక్రయాలను నిలుపుదల చేశారు. IIలో



డెంగీ నివారణకు చర్యలు
డెంగీ వ్యాధి నివారణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని మలేరియా జోనల్ అధికారి డాక్టర్ సరస్వతి ఆదేశించారు. డెంగీ కేసులు నమోదైన ప్రాంతాల్లో వారు పర్యటించారు. IIలో

దేశం తేజం మనదే

● నేడు పంద్రాగస్టు వేడుకలు ● జెండావిష్కరణ చేయనున్న మంత్రి బుగ్గన

ఒకప్పుడు..స్వేచ్ఛ లేదు.. స్వాతంత్ర్యం లేదు..బ్రిటీష్ వారు చెప్పిందే శాసనం..చేసిందే చట్టం.. ఎదురు తిరిగితే తీవ్ర నిర్బంధం..ఎన్నో ఉద్యమాలు.. ఎందరో త్యాగఫలం.. దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించింది. ఆంగ్లేయుల దాస్యశృంఖలాల నుంచి భరతమాతకు స్వేచ్ఛ లభించింది. నిండు లోకం హర్షించింది. భారతీయులకు మంచి కాలం వచ్చేసింది. దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించి నేటికి 76 సంవత్సరాలు పూర్తయ్యింది. ఈ సందర్భంగా ఊరూవాడా వేడుకకు సిద్ధమయ్యింది. కార్యాలయాలన్నీ త్రివర్ణ శోభితంతో వెలుగులీనుతుండగా.. మువ్వన్నెల జెండా ఆవిష్కరణకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. చిన్నాపెద్దా తేడా లేకుండా గుండె నిండా దేశభక్తితో మంగళవారం మువ్వన్నెల జెండాకు సెల్యూట్ చేయనున్నారు. మహనీయులను స్మరించుకోనున్నారు.



ఆదోని మండలం బల్లేకల్లులో జాతీయ జెండాతో ప్రదర్శన నిర్వహిస్తున్న విద్యార్థులు

కర్నూలు: పంద్రాగస్టు వేడుకలకు కర్నూలులోని పోలీస్ పరేడ్ మైదానం ముస్తాబైంది. మంగళవారం ఉదయం 9:05 గంటలకు ఆర్థిక, ప్రణాళిక వాణిజ్య పన్నులు, శాసనసభ వ్యవహారాలు, నైపుణ్యాభివృద్ధి, శిక్షణ శాఖామాత్యులు బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించనున్నారు. అనంతరం స్వాతంత్ర్య దినోత్సవ సందేశాన్ని చదివి వినిపించనున్నారు. తర్వాత రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ అభివృద్ధి సంక్షేమ పథకాలపై శకటాల ప్రదర్శన ఉంటుంది. వివిధ శాఖల అభివృద్ధికి సంబంధించిన స్టాల్స్‌ను పరేడ్ మైదానంలో ఏర్పాటు చేశారు. వేడుకల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు చోటివ్వకుండా పోలీసు శాఖ ఆధ్వర్యంలో నగరంలో విస్తృత తనిఖీలు నిర్వహించారు.

575 మందికి ప్రశంసాపత్రాలు

కర్నూలు(సెంట్రల్): ఉత్తమ పనితీరును కనబరిచిన ప్రభుత్వ ఉద్యోగులకు స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రశంసాపత్రాలు అందించనున్నారు. ఈ యేడాది 575 మంది ఉద్యోగుల పేర్లను ఆయా శాఖల అధికారులు నివేదించారు. సెల్‌ఫోన్ల ద్వారా సమాచారం అందిన వారందరూ ఉదయం 8.30 గంటలలోపు కర్నూలులోని పోలీస్ పరేడ్ గ్రౌండ్ చేరుకోవాలి.

లోకాయుక్త, హెచ్‌ఆర్‌సీలలో..

స్వాతంత్ర దిన వేడుకల నిర్వహణకు లోకాయుక్త, హెచ్‌ఆర్‌సీలలో ఏర్పాట్లు పూర్తయ్యాయి. హెచ్‌ఆర్‌సీలో ఉదయం 11 గంటలకు చైర్మన్ జస్టిస్ మాంధాత సీతారామమూర్తి, లోకాయుక్తలో ఉదయం 8.30 గంటలకు చైర్మన్ జస్టిస్ పి.లక్ష్మణ్‌రెడ్డి జెండావిష్కరణలు చేసి సాయుధ దళాల నుంచి గౌరవ వందనం స్వీకరించి సందేశాన్ని ఇవ్వనున్నారు. ప్రజలకు ఆయా సంస్థల చైర్మన్‌లు ముందస్తుగా శుభాకాంక్షలు తెలిపారు.

సెల్ఫీలను వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలి..

ఆజాదీకా అమృత్ మహోత్సవంలో భాగంగా హర్ ఘర్ తిరంగా కార్యక్రమం చేపట్టాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పిలుపునిచ్చారు. ఈనెల 13 నుంచి 15వ తేదీ వరకు ప్రజలు ఎవరికి వారు నిబంధనలు మేరకు తమ ఇళ్లపై జాతీయ జెండాలను ఆవిష్కరించి సెల్యూట్ చేయాలని కోరారు. అంతేగాక సెల్ఫీలు దిగాలని పిలుపునిచ్చారు. దిగిన సెల్ఫీలను హర్‌ఘర్ తిరంగా వెబ్‌సైట్లో అప్‌లోడ్ చేయాలని కోరారు.

పేరెంట్స్ కమిటీ చైర్మన్లతో జెండావిష్కరణ

కర్నూలు సిటీ: అన్ని ప్రభుత్వ యాజమాన్యాలకు చెందిన పాఠశాలల్లో జాతీయ జెండాను ఆయా స్కూళ్ల పేరెంట్స్ కమిటీల చైర్మన్లతో ఆవిష్కరింపజేయాలని పాఠశాల విద్య కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. పేరెంట్స్ కమిటీల చైర్మన్లు అందుబాటులో లేని చోట్ల ఆయా స్కూళ్ల ప్రధానోపాధ్యాయులు జెండాను ఆవిష్కరించాలని సూచించారు.



పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో పంద్రాగస్టు వేడుకలకు సిద్ధమైన వేదిక


మువ్వన్నెల వెలుగుల్లో లోకాయుక్త కార్యాలయం


కొండారెడ్డి బురుజు వద్ద జాతీయ జెండాలతో ప్రదర్శన

న్యూస్‌రీల్

మంత్రాలయంలో కొనసాగుతున్న భక్తుల రద్దీ


శ్రీమఠం ప్రాంగణంలో భక్తుల సందడి

మంత్రాలయం: శ్రీ రాఘవేంద్రస్వామి మఠంలో భక్తుల రద్దీ కొనసాగుతూనే ఉంది. శని, ఆదివారాలు సెలవు దినాలు కావడంతో వేలాదిగా భక్తులు మంత్రాలయం వచ్చారు. మూడో రోజు సోమవారం సైతం రద్దీ కొనసాగింది. ఆగస్టు 15వ తేదీ స్వాతంత్ర్య దినోత్సవం కావడంతో సోమవారం సెలవుపెట్టుకుని చాలా మంది ఇక్కడికి వచ్చారు. 8 వేలకు పైగా భక్తులు దర్శనం చేసుకున్నట్లు అంచనా. రాఘవేంద్రుల మూల బృందావన దర్శనానికి అరగంట సమయం పట్టింది. తుంగభద్ర నదీతీరం, అన్నపూర్ణ భోజనశాల, పరిమళ ప్రసాదం, మంచాలమ్మ దర్శన క్యూలైన్లు కిటకిటలాడాయి. కర్ణాటక, తమిళనాడు, తెలంగాణ ప్రాంతాల నుంచి అత్యధికంగా భక్తులు వచ్చారు. మఠం ఏఏవో మాధవశెట్టి, మేనేజర్-1 శ్రీనివాసరావు, మేనేజర్-2 వెంకటేష్ జోషి, జోనల్ మేనేజర్ శ్రీపతి ఆచార్, ధార్మిక సహాయక అధికారి వ్యాసరాజాచార్ భక్తుల ఏర్పాట్లను పర్యవేక్షించారు.

జిల్లాకు 6,650 వీవీప్యాట్ల కేటాయింపు

కర్నూలు(సెంట్రల్): వచ్చే పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల్లో వినియోగించేందుకు జిల్లాకు 6,650 వీవీప్యాట్లను కేటాయించారు. వీవీప్యాట్ల ద్వారా ఓటరు తాను ఏ అభ్యర్థికి ఓటు వేశానో తెలుసుకోవడానికి అవకాశం ఉంటుంది. ఈ క్రమంలో మంగళవారం జాతీయ ఎన్నికల సంఘం బెంగళూరు నుంచి జిల్లాకు కేటాయించిన వీవీప్యాట్లను పంపనుంది. వచ్చిన వీవీ ప్యాట్లను కలెక్టరేట్‌లోని ఈవీఎం గోదాములో భద్రపరచనున్నారు.

పీజీ వైద్య విద్యార్థుల స్టైఫండ్ పెంపు

కర్నూలు(హాస్పిటల్): బోధనాసుపత్రుల్లో సూపర్‌స్పెషాలిటీ కోర్సును అభ్యసించే పీజీ వైద్య విద్యార్థుల స్టైఫండ్‌ను పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు ప్రభుత్వ స్పెషల్ ప్రిన్సిపల్ సెక్రటరీ కృష్ణబాబు జీవో విడుదల చేశారు. మొదటి సంవత్సరం విద్యార్థులకు రూ.70వేలు, రెండో సంవత్సరం విద్యార్థులకు రూ.72వేలు, మూడోసంవత్సరం విద్యార్థులకు రూ.74వేలను స్టైఫండ్‌ను ఇకపై ఇవ్వనున్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్టైఫండ్‌ను పెంచడం పట్ల వైద్య విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు.

స్టెనోగ్రాఫర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల

కర్నూలు(సెంట్రల్): స్టాఫ్ సెలక్షన్ కమిషన్ ప్రతియేటా నిర్వహించే స్టెనోగ్రాఫర్ గ్రూపు సీఅండ్‌డీ నాన్ గెజిటెడ్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైనట్లు డీఆర్వో ఎస్వీ నాగేశ్వరరావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులను ఆన్‌లైన్‌లో మాత్రమే సమర్పించాలని, దరఖాస్తు చేసుకోవడానికి ఆగస్టు 23వ తేదీ వరకు అవకాశం ఉందని పేర్కొన్నారు. అక్టోబర్‌లో కంప్యూటర్ బేస్ పరీక్షను నిర్వహించే అవకాశం ఉందని, అర్హత, పోస్టులు, వయసు, ఇతర వివరాల కోసం ssc.nic.in వెబ్‌సైట్‌ను సందర్శించి తెలుసుకోవాలని ఆయన అభ్యర్థులకు సూచించారు.

నేటి నుంచి పంచాయతీల్లో డిజిటల్ చెల్లింపులు

కర్నూలు(అర్బన్): జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీల్లో ఈ నెల 15 నుంచి వివిధ రకాల సేవలకు డిజిటల్ చెల్లింపులను మాత్రమే అంగీకరించనున్నట్లు జిల్లా పంచాయతీ అధికారి టి.నాగరాజునాయుడు తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నగదు రహిత లావాదేవీలకు సంబంధించి పీఆర్ అండ్ ఆర్‌డీ కమిషనర్ స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారన్నారు. జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీలు యూనియన్ బ్యాంకులో కరెంట్ అకౌంట్ ఓపెన్ చేసుకోవాలని ఇప్పటికే సూచించామన్నారు. డిజిటల్ చెల్లింపులకు సంబంధించి 2011 జనాభా లెక్కల ప్రకారం 3వేలకు పైగా జనాభా ఉన్న గ్రామ పంచాయతీల్లో పీఓఎస్ మిషన్లను ఏర్పాటు చేసుకోవాల్సి ఉందని, 3 వేల కంటే తక్కువ జనాభా ఉన్న గ్రామ పంచాయతీల్లో క్యూఆర్ కోడ్ ద్వారా చెల్లింపులు చేపట్టాలన్నారు. జిల్లాలో మొత్తం 484 గ్రామ పంచాయతీలు ఉండగా, 158 గ్రామ పంచాయతీల్లో 3 వేలకు పైగా జనాభా ఉందని, అలాగే 326 గ్రామ పంచాయతీల్లో 3 వేల కంటే తక్కువ జనాభా ఉందన్నారు. డిజిటల్ చెల్లింపులకు సంబంధించి ప్రజల్లో అవగాహన పెంచాలని ఇప్పటికే ఈఓ ఆర్‌డీ, పంచాయతీ కార్యదర్శులకు ఆదేశాలు జారీ చేశామన్నారు.

చేనేత మగ్గంపై 'స్వదేశీ' అస్త్రం


చేనేత మగ్గం ద్వారా వస్త్రాలు తయారు చేస్తున్న మహిళ (ఫైల్)

కర్నూలు(అగ్రికల్చర్): ఆంగ్లేయుల నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా 1905 ఆగస్టులో స్వదేశీ ఉద్యమం ప్రారంభమైంది. విదేశీ వస్త్రాలను బహిష్కరించి భారతీయులంతా స్వదేశీ వస్త్రాలను తమకుతామే తయారు చేసుకోవడం చేపట్టారు. మహాత్మాగాంధీ స్వయంగా రాట్నం తిప్పి నూలు వడికారు. స్వదేశీ ఉద్యమ స్ఫూర్తితో 1938లో ఎమ్మిగనూరు చేనేత సహకార సంఘం ఏర్పాటైంది. ఇక్కడ మగ్గాలపై ఉత్పత్తి చేసిన చేనేత వస్త్రాలు ధరించి చాలా మంది నాయకులు స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్నారు. దీంతో ఎమ్మిగనూరు చేనేత వస్త్రాలకు జాతీయ స్థాయిలో గుర్తింపు లభించింది. ఎమ్మిగనూరులోని వీవర్స్ కాలనీకి ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు మొరార్జీ దేశాయ్ శంకుస్థాపన చేశారు. అప్పటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూతో ఎమ్మిగనూరు చేనేత సహకార సంఘం వ్యవస్థాపకుడు మాచాని సోమప్ప గుంతకల్లులో సమావేశమై చేనేత వస్త్రాల ఉత్పత్తి, విశిష్టతను వివరించారు. ఈ సొసైటీకి ఇంటర్నేషనల్ అవార్డుతో పాటు పలు నగదు పురస్కారాలు కూడా దక్కాయి. హోదాను, హుందాతనాన్ని ప్రతిబింబించే చేనేత వస్త్రాలను ఇప్పటికీ ఇక్కడి కార్మికులు మగ్గాలపై తయారు చేస్తున్నారు.

అర్జీలు రీఓపెన్ కాకూడదు

● జిల్లా కలెక్టర్ సృజన


ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్ సృజన. జేసీ నారపురెడ్డి మౌర్య

కర్నూలు(అర్బన్): జగనన్నకు చెబుదాం - స్పందన కార్యక్రమానికి వచ్చే అర్జీలు రీఓపెన్ కాకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను జిల్లా కలెక్టర్ డాక్టర్ జీ సృజన ఆదేశించారు. సోమవారం స్థానిక జిల్లా పరిషత్ సమావేశ భవనంలో స్పందన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా కలెక్టర్‌తోపాటు జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లా , మండల స్థాయి అధికారులు అర్జీదారులకు ఎండార్స్‌మెంట్‌ను కార్యాలయాలకు వద్దకు పిలిపించి ఇవ్వాలని, అలాగే అకనాలెడ్జ్‌మెంట్ తీసుకోవాలన్నారు. ఇలా చేయడం వల్ల అర్జీదారుల్లో సంతృప్తి స్థాయి పెరిగే అవకాశం ఉంటుందన్నారు. అర్జీదారుల వినతులను సంబంధిత అధికారులు క్షేత్ర స్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేయాలన్నారు. నిర్ణీత గడువులోగా అర్జీలను తప్పనిసరిగా పరిష్కరించాలన్నారు. పెండింగ్ దరఖాస్తులు, బియాండ్ ఎస్‌ఎల్‌ఏలోకి వెళ్లకుండా వచ్చిన దరఖాస్తులను మళ్లీ రీఓపెనింగ్ కాకుండా నాణ్యతతో పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌ఓ నాగేశ్వరరావు, జిల్లా పరిషత్ సీఈఓ జీ నాసర రెడ్డి, సీపీఓ అప్పలకొండ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు అనురాధ, నాగప్రసన్న లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సీఐ మురళీధర్‌రెడ్డికి ఇండియన్ పోలీస్ మెడల్



కర్నూలు: కర్నూలు మూడో పట్టణ సీఐ దాదిరెడ్డి మురళీధర్‌రెడ్డికి అరుదైన గౌరవం లభించింది. ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ వేడుకల వేళ రాష్ట్రంలోని పలువురు పోలీసు అధికారులకు కేంద్ర హోంమంత్రిత్వ శాఖ పలు పతకాలు ప్రకటించింది. ఇందులో భాగంగా తన సర్వీసు కాలంలో ఉత్తమ సేవలు అందించినందుకు 2023 సంవత్సరానికి మురళీధర్‌రెడ్డికి ఇండియన్ పోలీస్ మెడల్(పురస్కారం) దక్కింది. కడప జిల్లా పెండ్లిమర్రి మండలం ఎగువపల్లి గ్రామానికి చెందిన మురళీధర్‌రెడ్డి 1996లో ఎస్‌ఐ హోదాలో పోలీసు శాఖలో చేరారు. ఈయన తండ్రి మస్తాన్‌రెడ్డి కూడా పోలీసు అధికారిగా పదవీ విరమణ పొందారు. మురళీధర్‌రెడ్డి తన సర్వీసు కాలంలో సేవా పతకం(2009), ఉత్కృష్ట సేవా పతకం(2021), ఉత్తమ సేవా పతకం (2022), 6 ఎంఎస్‌ఇలు, 163 గుడ్ సర్వీస్ ఎంట్రీలు, 6 కమెండేషన్ మెడల్స్, 25 క్యాష్ రివార్డులు పొందారు. ఈయన 2011లో సీఐగా పదోన్నతి పొంది కర్నూలు, అనంతపురం, చిత్తూరు జిల్లాల్లోని వివిధ పోలీస్‌స్టేషన్లలో విధులు నిర్వహించారు. 2024 జనవరి 26వ తేదీన ముఖ్యమంత్రి చేతుల మీదుగా మురళీధర్‌రెడ్డి ఇండియన్ పోలీస్ మెడల్‌ను అందుకోనున్నారు.

జిల్లా వాసికి అరుదైన గౌరవం

● శ్రీనగర్ ఎస్పీకి ఐదో విడత పోలీస్ మెడల్ ఫర్ గ్యాలెంట్రీ అవార్డు


జి.వి.సందీప్ చక్రవర్తి, శ్రీనగర్ ఎస్పీ

కర్నూలు: జమ్మూ కశ్మీర్ రాష్ట్రం శ్రీనగర్ సిటీ ఎస్పీ డాక్టర్ జి.వి.సందీప్ చక్రవర్తికి పోలీస్ మెడల్ ఫర్ గ్యాలెంట్రీ అవార్డు(పీఎంజీ) దక్కింది. ఈయన కర్నూలు నగరవాసి. మంగళవారం న్యూఢిల్లీలో జరిగే పరేడ్‌లో ఈయన పీఎంజీ అవార్డును అందుకోనున్నారు. అస్థిరమైన కశ్మీర్ ప్రాంతంలో దేశద్రోహ వ్యతిరేక, కౌంటర్ తిరుగుబాటు కార్యకలాపాల అణచివేతలో అత్యుత్తమ ప్రతిభ సేవలకు కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఈయనకు పోలీస్ మెడల్ ఫర్ గ్యాలెంట్రీ అవార్డు ప్రకటించింది. తన ఎనిమిది సంవత్సరాల సర్వీసులో సందీప్ చక్రవర్తి 5వ సారి పీఎంజీ అవార్డుకు ఎంపిక కావడం విశేషం. కర్నూలు ప్రభుత్వాసుపత్రి రిటైర్డ్ ఆర్‌ఎంఓ డాక్టర్ జి.వి.రామగోపాల్ రావు, వైద్యఆరోగ్య శాఖలో విధులు నిర్వహిస్తూ పదవీ విరమణ పొందిన రంగమ్మ దంపతుల కుమారుడు సందీప్ చక్రవర్తి ప్రస్తుతం శ్రీనగర్ ఎస్పీగా విధులు నిర్వహిస్తున్నారు. కర్నూలు ఎ.క్యాంప్‌లోని మాంటిస్సోరి హైస్కూల్‌లో పాఠశాల విద్య, కర్నూలు మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ డిగ్రీని పొందారు. 2014 యూపీఎస్‌సీలో సివిల్స్ ర్యాంక్ సాధించి ఐపీఎస్‌కు ఎంపికయ్యారు.

నీటిని పొదుపుగా వాడుకోవాలి


గోరుకల్లు వద్ద కృష్ణమ్మకు చీరె, సారెను అందిస్తున్న ఎమ్మెల్యే కాటసాని, ఎంపీ పోచా

● బ్లాక్‌ల వద్ద నీటి వృథా అరికట్టేందుకు రైతులు చొరవ చూపాలి
● ఎంపీ పోచా, ఎమ్మెల్యే కాటసాని

పాణ్యం: ఆశించిన స్థాయిలో ప్రాజెక్టుల్లో నీటి లభ్యత లేదని, అందుబాటులో ఉన్న నీటిని ఆయకట్టు రైతులు పొదుపు వినియోగించుకోవాలని నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి సూచించారు. ఇటీవల బానకచర్ల హెడ్‌రెగ్యులేటర్ నుంచి విడుదలైన కృష్ణా జలాలు సోమవారం గోరుకల్లు రిజర్వాయర్‌కు చేరుకున్నాయి. సీఈ కబీర్ బాషా ఆధ్వర్యంలో ఎంపీ, ఎమ్మెల్యే గోరుకల్లు చేరుకుని కృష్ణమ్మకు జలహారతి ఇచ్చి, చీరె సారె సమర్పించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో ఎంపీ, ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాలు సమృద్ధిగా లేకపోవడంతో సాగునీటి ప్రాజెక్టులకు ఆశించిన మేర నీటి విడుదల లేదన్నారు. ఈ ఏడాది శ్రీశైలం జలాశయం ద్వారా ఉమ్మడి కర్నూలు జిల్లాకు కేవలం 23 టీఎంసీలు మాత్రమే కేటాయించారన్నారు. త్వరలోనే ఆయకట్టు రైతులు, అధికారులు, ప్రజా ప్రతినిధులతో సమీక్ష నిర్వహించి ఎస్సార్బీసీ కాల్వకు నీరు విడుదల చేస్తామని, నీటిని దుర్వినియోగం చేయకుండా అవసరమైన మేరకు వినియోగించాలని సూచించారు. ప్రస్తుతం బానకచర్ల క్రాస్ రెగ్యులేటర్ నుంచి గోరుకల్లులోకి 6వేల క్యూసెక్కులు చేరుకుంటున్నాయన్నారు. ఇటీవల కుంగిన గోరుకల్లు కట్టను నెల రోజుల్లో మరమ్మతులు పూర్తి చేశామన్నారు. గోరుకల్లు కట్ట కుంగిన విషయం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా యుద్ధ ప్రాదిపతికన గ్రీన్‌కో వారి సహాయంతో పనులు చేయించినట్లు చెప్పారు. మరమ్మతుల కోసం రూ. 90 లక్షలు నిధులు కేటాయించారన్నారు. అలాగే పెండింగ్ పనులు పూర్తి చేసేందుకు రూ.100 కోట్లు మంజూరు చేశారన్నారు. గోరుకల్లు కట్ట విషయంలో రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. కార్యక్రమంలో మాజీ జెట్పీటీసీ సభ్యులు సద్దల సూర్యనారాయణ రెడ్డి, ఈఈ సుభకుమార్, డీఈఈలు గోవర్ధన్, రాజశేఖర్, ఏఈలు, జేఈఈలు, అమర్‌నాథ్ రెడ్డి, ఉసేన్‌సా, శ్రీనివాసరెడ్డి, రామలక్ష్మయ్య, పాలం చంద్రశేఖర్‌రెడ్డి, బొజ్జన్న, శంకర్‌రెడ్డి, రవి, భాస్కర్, ప్రతాప్‌రెడ్డి, తొగర్చేడు శ్రీనివాసరెడ్డి, బాలిరెడ్డి, బాబు జాకీర్ ఉసేన్, నారాయణస్వామి, ఈశ్వరయ్య, రామచంద్రుడు, రవిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పల్లె పోరులో 34 మంది అభ్యర్థులు

● 19న ఉదయం 7 గంటల నుంచి పోలింగ్
● అదే రోజున ఓట్ల లెక్కింపు, ఫలితాల ప్రకటన

కర్నూలు(అర్బన్): జిల్లాలో ఖాళీగా ఉన్న గ్రామ సర్పంచు, వార్డు సభ్యుల స్థానాలకు ఈ నెల 19న జరగనున్న ఉప ఎన్నికలకు సంబంధించి మొత్తం 34 మంది అభ్యర్థులు బరిలో ఉన్నట్లు జిల్లా పంచాయతీ అధికారి టి.నాగరాజునాయుడు చెప్పారు. సోమవారం సాయంత్రం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కొత్తాళం మండలం బదినేహాల్ సర్పంచు స్థానానికి నలుగురు నామినేషన్లు దాఖలు చేయగా, ఇద్దరు అభ్యర్థులు నామినేషన్లను ఉప సంహరించుకోగా, మిగిలిన ఇద్దరు బరిలో నిలిచారన్నారు. ఖాళీగా ఉన్న 42 వార్డుల్లో 27 వార్డు స్థానాలకు అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నిక కాగా, మిగిలిన 15 వార్డులకు ఎన్నికలు జరుగనున్నాయన్నారు. ఈ వార్డులకు సంబంధించి మొత్తం 32 మంది పోటీలో ఉన్నట్లు డీపీఓ తెలిపారు. ఈ నెల 19న ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పోలింగ్ నిర్వహించి, అదే రోజున మధ్యాహ్నం 2 గంటల నుంచి ఓట్లను లెక్కించి ఫలితాలను వెల్లడించడంతో ఎన్నికల ప్రక్రియ పూర్తవుతుందన్నారు. ఎక్కడైనా అనుకోని ఘటనలు చోటు చేసుకుంటే మరుసటి రోజున అంటే 20వ తేదీన పోలింగ్ నిర్వహిస్తామని డీపీఓ చెప్పారు.

క్లుప్తంగా

పోలీస్ స్పందనకు 89 ఫిర్యాదులు



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ కృష్ణకాంత్

కర్నూలు : జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ కృష్ణకాంత్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 89 ఫిర్యాదులు వచ్చాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి ఎస్పీ వినతులు స్వీకరించారు. ఫిర్యాదులపై చట్ట పరిధిలో విచారణ జరిపి త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని ఎస్పీ వారికి హామీ ఇచ్చారు. డీఎస్పీ యుగంధర్ బాబు, లీగల్ అడ్వైజర్ మల్లికార్జున రావు పాల్గొన్నారు.

మరింత పటిష్టంగా ఆరోగ్యశ్రీ అమలు



మాట్లాడుతున్న డాక్టర్ వి. వెంకటరంగారెడ్డి

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో ఆరోగ్యశ్రీ పథకాన్ని మరింత పటిష్టంగా అమలు చేయనున్నట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వి. వెంకటరంగారెడ్డి చెప్పారు. సోమవారం ఆయన ఆసుపత్రిలోని వివిధ విభాగాల హెచ్‌వోడీలతో సమావేశం నిర్వహించారు. ఇకపై ఆసుపత్రిలోని అన్ని విభాగాధిపతులతో ప్రతి సోమవారం ఆరోగ్యశ్రీపై సమీక్ష సమావేశం నిర్వహిస్తానని తెలిపారు. సమావేశంలో డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ సి. ప్రభాకర్‌రెడ్డి, సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ బి. వెంకటేశ్వరరావు, ఆర్ఎంఓ డాక్టర్ వెంకటరమణ, హెచ్ఓడీలు పాల్గొన్నారు.

అమరం.. అఖిలం.. మీ త్యాగం

- స్వాతంత్ర్య ఉద్యమంలో జిల్లా నాయకుల కీలకపాత్ర
- జిల్లాలో రెండు విడతలుగా మహాత్ముని పర్యటన
- సిపాయిల తిరుగుబాటుకు ముందే బ్రిటీష్ వారిని తాకిన ఉద్యమ జ్వాల
- స్వాతంత్ర్య ఉద్యమంలో సర్వం కోల్పోయిన త్యాగధనులు
- నేడు స్వాతంత్ర్య దినోత్సవం



కర్నూలు కల్చరల్: స్వాతంత్ర్య సంగ్రామంలో జిల్లా వాసులు అలుపెరుగని పోరాట స్ఫూర్తిని కనబరిచారు. తెల్లదొరల నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా ఉద్యమాలు నడిపారు. ధన, మన, ప్రాణాలు ఫణంగా పెట్టారు. జైలు శిక్షలకు వెరవక ఉద్యమమే ఊపిరిగా ముందుకు సాగారు. వందేమాతరం అంటూ ఉప్పెనై కదిలి బ్రిటీష్ పాలకులను గజగజ వణికించారు. తుపాకీ తూటాలను సైతం లెక్క చేయక స్వాతంత్ర్యమే లక్ష్యంగా కదం తొక్కారు. సిపాయిల తిరుగుబాటు 1857లో జరగగా..అంతకు ముందే కర్నూలు జిల్లాలో తెల్లదొరలపై ఉద్యమానికి బీజం పడింది. 1801లోనే తెర్నేకల్లులో తిరుగుబాటు ప్రారంభమైంది. 1842లో ఉయ్యాలవాడ నరసింహారెడ్డి విప్లవ శంఖం పూరించాడు. వారి త్యాగం అమరం..అఖిలం.. మంగళవారం స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం..

గర్జించిన గులాం రసూల్ ఖాన్

బ్రిటీష్ దొరల పెత్తనాన్ని కర్నూలు చివరి నవాబు గులాం రసూల్ ఖాన్ వ్యతిరేకించారు. తన అనుచరులందరినీ వెంటబెట్టుకొని వెళ్లి కర్నూలు సమీపంలోని జొహరాపురం కేంద్రంగా ఉద్యమం ప్రారంభించారు. 1839లో వహబీ ఉద్యమ నేతలతో సంబంధాలు పెట్టుకుని ఉద్యమాన్ని మరింత ఉధృతం చేశారు. బ్రిటీష్ సైన్యం గులాం రసూల్ ఖాన్‌ను బంధించి తిరుచునాపల్లి జైలుకు తరలించింది. ఆయనపై విష ప్రయోగం చేసి నిర్దాక్షిణ్యంగా హతమార్చింది.

ఎందరో పోరాట యోధులు..

ఖాదర్‌బాద్ నర్సింగరావు, గాడిచర్ల హరిసర్వోత్తమరావు, వనం శంకర శర్మ, నివర్తి వెంకట సుబ్బయ్య, టి.చిదంబరం, ఆర్‌కే రామ్, గామాగో, చిదరంబరం, మేడం వెంకయ్య శెట్టి, పెండేకల్ అట్లారెడ్డి లక్ష్మమ్మ, మేడం వెంకయ్యశెట్టి, ధరణి రాచంద్రారావు, సర్దార్ నాగప్ప, సర్దార్ అమరావతమ్మ వంటి ఎందరో పోరాట యోధులు స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్నారు.


స్ఫూర్తి ప్రదాతలు

- నంద్యాల జిల్లా కడుమల కాలువకు చెందిన టీకే ఆర్ శర్మ భూస్వామి. ఈయన స్వాతంత్ర్య పోరాటానికి తన ఆస్తినంతా ఇచ్చారు. ఈయన సోషలిస్ట్ వాది. రామ్ మనోహర్ లోహియా అనుచరుడు. 1962-67 లో కర్నూలు ఎమ్మెల్యేగా పనిచేశారు.
- కర్నూలు పెద్దమార్కెట్ ఎదురుగా సుభాష్ హేర్‌కటింగ్ షాప్ ఉండేది. దీన్ని రంగన్న అనే వ్యక్తి నిర్వహిస్తుండేవారు. ఆయన కుమారుడు పుల్లన్న, ఆయన కుమారుడు సుభాష్‌లు దుకాణాన్ని నిర్వహిస్తూ స్వాతంత్ర్య ఉద్యమ నాయకులకు ఉచితంగా కటింగ్ చేసేవారు. అదే ప్రాంతంలోనే నాగోజీ అనే టైలర్ ఉండే వారు. ఆయన ఉచితంగా బట్టలు కుట్టించి ఇచ్చేవాడు. అక్కడే ఉడిపి హోటల్ ఉండేది. వీరు సైతం ఉచితంగా భోజనం పెట్టేవారు.

జిల్లాలో పర్యటించిన గాంధీజీ

స్వాతంత్ర్యోద్యమ కాలంలో జాతిపిత గాంధిజీ ప్రసంగం ఆదోని ప్రజల్లో స్ఫూర్తిని నింపింది. 1926లో అప్పటి బ్రిటీష్ ప్రభుత్వం ఉప్పుపై పన్ను విధించింది. ఇందుకు నిరసనగా గాంధీజీ దేశంలో పాదయాత్ర చేపట్టి దేశ ప్రజలందరినీ ఒక్క తాటిపైకి తెచ్చేందుకు యత్నించారు. ఇందులో భాగంగానే ఆయన 1930 సెప్టెంబర్ 30న కర్ణాటకలోని సండూరులో జరిగిన బహిరంగ సభలో పాల్గొని అనంతరం రైలులో ఆదోనికి చేరుకున్నారు. స్థానిక మున్సిపల్ మైదానంలో జరిగిన బహిరంగ సభలో జాతిపిత ఉద్వేగంగా హిందీలో ప్రసంగించారు. పట్టణానికి చెందిన చున్నీలాల్ జయచంద్ సోనో ఆయన ప్రసంగాన్ని తెలుగులో అనువదించారు. ఆయన ఉద్వేగ పూరితంగా చేసిన ప్రసంగం స్థానికంగా ప్రజల్లో స్వాతంత్ర్య సమర స్ఫూర్తిని నింపింది.

తెల్లదొరలపాలిట సింహ స్వప్నం



రేనాటి సూర్యుడు, విప్లవ వీరుడు ఉయ్యాలవాడ వీర నరసింహారెడ్డి బ్రిటీష్ నిరంకుశత్వ పాలనకు ప్రతిఘటించారు. 1842లో తెల్లదొరలపై తిరుగు బాటు బావుటా ఎగురవేశాడు. తన పోరాటంలో కోవెలకుంట్ల తహసీల్దార్‌ను నరికి చంపడమే కాక బ్రిటీష్ వారి ఖజానాను అంతా కొల్లగొట్టారు. ఈయన విప్లవ మార్గానికి వణికిపోయిన బ్రిటీష్‌వారు 1847 ఫిబ్రవరి 22వ తేదీన కోవెలకుంట్ల సమీపంలో గల జుర్రేరు ఒడ్డున ఉరిశిక్ష అమలు పరిచారు.

పోరుగల్లు.. తెర్నేకల్

జిల్లాలో 1801లోనే బ్రిటీష్ వారిపై తిరుగు బాటు బావుటా ఎగరవేశారు తెర్నేకల్ వాసులు. బ్రిటీష్ వారు వేసిన పన్నుకు వ్యతిరేకంగా ముత్తుకూరు గౌడప్ప ఆధ్వర్యంలో బ్రిటీష్ సైన్యంతో పోరాటం చేశారు. పోరులో గౌడప్పతో పాటు ఆ గ్రామ రైతులు బలయ్యారు.

సంచలనంగా కర్నూలు సర్క్యులర్

కర్నూలులో కొందరు విప్లవ భావాలతో ఒక సర్క్యులర్ రూపొందించారు. దీన్నే కర్నూలు సర్క్యులర్ అంటారు. ఆంధ్రదేశమంతటా ప్రజలు టెలిఫోన్ తీగలను తెంపివేయాలని, రైలు పట్టాలను తొలగించాలని కార్మికులు సమ్మెకు పిలుపునివ్వాలని, రైల్లో టికెట్ లేకుండా ప్రయాణాలు చేయాలని ప్రభుత్వానికి ఎటువంటి పన్నులు చెల్లించకూడదని, ప్రభుత్వ ఆజ్ఞలు దిక్కరించాలని పిలుపునిస్తూ ఒక సర్క్యులర్ రూపొందించారు. ఇది రాష్ట్రమంతటా సంచలనం రేపింది.

పత్రికల ప్రభావం

స్వాతంత్ర్య ఉద్యమంలో గాడిచెర్ల విజయభేరి, ప్రేమ, తుంగభద్ర, దక్కన్ వైశ్య, మాణిక్య ప్రభు, ఉపాధ్యాయ, భద్రవాణి లాంటి పత్రికలు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వెలువడుతూ ప్రజలను చైతన్య వంతులను చేశాయి. శంకర నారాయణ భజన మందిరం, హిందూ మహమ్మదీయ సంఘం, యూనియన్ క్లబ్ దేశాభిమాని సభ లాంటి సంస్థలు ప్రజల్లో స్వాతంత్ర్య కాంక్ష పెరగడానికి ఉద్యమం వైపు అడుగులు వేయడానికి ఎంతగానో కృషి చేశాయి.

ముందే ఎగిరిన జాతీయ జెండా

దేశంలో క్విట్ ఇండియా ఉద్యమం నాటికి జిల్లాలో ఉద్యమం మరింత తీవ్ర రూపం దాల్చింది. ఈ సమయంలో కర్నూలులోని రాణి తోట మైదానంలో జాతీయ జెండా ఎగుర వేసి వందేమాతర గీతాన్ని ఆలపించాలని తలచారు. కానీ ప్రభుత్వ నిర్బంధం వల్ల ఎవరూ సాహసించ లేకపోయారు. అటువంటి సమయంలో తిప్పారెడ్డి అనే దేశ భక్తుడు కొందరు పిల్లలను తోడుగా తీసుకెళ్లి ధైర్యంగా జెండా ఎగుర వేశారు.

ఆలూరుకు ప్రత్యేక గుర్తింపు

ఆలూరు నియోజకవర్గంలో మొత్తం 12 మంది స్వాతంత్ర్య సమరయోధులు ఉన్నారు. సంజీవరెడ్డి, గోవిందదాసు, అక్బర్ అలీ, పుల్లా అయ్యపరెడ్డి, హెచ్. బసవన్నగౌడ్, బొగ్గుల బాలయ్య, నరసింహారెడ్డి, రామకృష్ణారెడ్డి, హనుమప్ప నాయక్, పాపయ్య చౌదరి లాంటివారు స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్నారు. 1942లో క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొని ఆంగ్లేయులను ఎదురించడంతో వీరిని అరెస్ట్ చేసి బళ్లారిలోని హళ్లీపూర్ జైలులో కొన్ని రోజుల పాటు ఉంచారు. వీరికి గుర్తుగా ఆలూరులోని మండల పరిషత్తు కార్యాలయం వద్ద స్థూపాన్ని సైతం ఏర్పాటు చేశారు. డి.గోవిందదాసు నియోజకవర్గ శాసన సభ్యులుగా సేవలు అందించారు.

ఖద్దరు నిధికి విరాళాలు

1929 సంవత్సరం మే నెలలో గాంధీజీ ఆలిండియా ఖద్దరు యాత్రలో భాగంగా జిల్లాలోని చాగలమర్రి, నల్లగట్ల, శిరువెళ్ల, ఆళ్లగడ్డ, ఉయ్యాలవాడ, నంద్యాల, అయ్యలూరు, పాణ్యం, కర్నూలు, నాగలాపురం, ప్యాలకుర్తి, కోడుమూరు, దేవనకొండ, పత్తికొండ, ఆదోనిలో ఖద్దరు నిధికి చందాలు వసూలు చేశారు.

“ స్ఫూర్తిగా తీసుకోవాలి



స్వాతంత్ర్యం కోసం ఎందరో త్యాగధనులు తమ మాన, ప్రాణాలను పోగొట్టుకున్నారు. జిల్లాకు చెందిన మహా నాయకులు సైతం ఇందులో పాల్గొని ఖ్యాతిని తెచ్చారు. అలాంటి వారందరినీ స్ఫూర్తిగా తీసుకోవాలి. స్వాతంత్ర్యం వచ్చిందని మరచిపోకుండా, ఆ స్వాతంత్ర్య ఉద్యమ ఫలాలను అందరికీ అందించాలి.

– కురాడి చంద్రశేఖర కల్కూర, గాడిచర్ల ఫౌండేషన్ అధ్యక్షుడు

మహనీయులను స్మరించుకోవాలి



స్వాతంత్ర్య దినోత్సవం అంటే కేవలం జాతీయ జెండా ఎగుర వేసి మిఠాయిలు పంచుకొని తినడం కాదు. ప్రతి భారతీయుడు మూడు రంగుల జెండాను గుండెల్లో ప్రతిష్ఠించుకుని, హృదయం నిండా దేశభక్తిని నింపుకోవాలి. స్వాతంత్ర్యం కోసం ప్రాణాలను త్యాగం చేసిన మహనీయులను స్మరించుకోవాలి. కుల, మత, ప్రాంతాలకు అతీతంగా అందరం భరత మాత బిడ్డలం అంటూ సమైక్యతను చాటాలి.

– హరికిషన్, కవి, ఉపాధ్యాయుడు

భర్త మద్యానికి బానిసయ్యాడని..



మృతి చెందిన నందిని

పాములపాడు: భర్త మద్యానికి బానిసై కుటుంబాన్ని పట్టించుకోవడం లేదని మనస్తాపం చెందిన ఓ మహిళ ఆత్మహత్యకు పాల్పడిన ఘటన చెలిమిల్ల గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఆత్మకూరు మండలం సిద్దాపురం గ్రామానికి చెందిన గౌరీ శంకర్, నందిని(35) దంపతులు ఉపాధి నిమిత్తం 15 సంవత్సరాల క్రితం చెలిమిల్ల గ్రామానికి వచ్చి స్థిరపడ్డారు. వీరికి ఇద్దరు కుమారులు, ఒక కూతురు సంతానం. కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తుండగా గౌరీ శంకర్ మద్యానికి బానిసై కుటుంబం పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించేవాడు. ఈ క్రమంలో పలుమార్లు నందిని వారించినా అతనిలో మార్పు రాలేదు. దీంతో మనస్తాపం చెందిన నందిని ఈ నెల 13వ రాత్రి విషపు గుళికలు మింగి అపస్మారక స్థితికి చేరుకుంది. కుటుంబీకులు ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతురాలి తల్లి దస్తగిరమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ ఏసయ్య తెలిపారు.

ఫుట్‌బాల్ అండర్-14 జిల్లా జట్టు ఎంపిక

కర్నూలు(రూరల్): ఫుట్‌బాల్ అండర్-14 కర్నూలు జిల్లా జట్టును ఎంపిక చేసినట్లు ఫుట్‌బాల్ సంఘం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపికైన వారు ఈ నెల 16వ తేదీన కడపలో జరిగే జోనల్ స్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో పాల్గొంటారన్నారు. జట్టుకు భవి, ఆదిల్, ఉమేష్, సూర్య, రోహిత్, రిషికేష్, ప్రవీణ్, సుహాస్, జస్వంత్, శ్యామ్, అబ్దుల్, వాజిత్, ప్రజ్వల్, నరేంద్ర, చౌలరాజు, అజయ్, జస్సు, అభి ఎంపికయ్యారు.

మరణంలోనూ తోడుగా..

- భార్య మరణం తట్టుకోలేక ఆగిన భర్త గుండె
- గంటల వ్యవధిలో ఇద్దరూ మృతి



లింగాల కళావతి (ఫైల్) లింగాల ఏసన్న (ఫైల్)

గడివేముల: వారిది ఏడుగడుల బంధం. కష్ట సుఖాల్లో తోడుగా నిలిచారు. సంతానం లేకపోవడంతో ఒకరినొకరు లోకంగా బతికారు. వ్యవసాయం చేసుకుంటూ ఆనందంగా జీవితాన్ని గడుపుతున్న సమయంలో భార్యను క్యాన్సర్ మహమ్మారి కబళించింది. ఆమె మరణాన్ని ఆ భర్త తట్టుకోలేక పోయాడు. ఆయన గుండె ఆగిపోయింది. గంటల వ్యవధిలో భార్యాభర్తలు ప్రాణం విడిచారు. ఈ విషాద ఘటన బూజనూరు గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన లింగాల కళావతి(48), లింగాల ఏసన్న (58) దంపతులు వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నారు. వీరికి సంతానం లేదు. కొన్నాళ్ల క్రితం కళావతికి అనారోగ్యంగా ఉండటంతో వైద్య పరీక్షలు చేయించడంతో క్యాన్సర్ అని బయటపడింది. మందులు వాడుతున్నా కోలుకోలేక సోమవారం మధ్యాహ్నం పన్నెండు గంటల సమయంలో ఆమె మృతి చెందింది. కుటుంబసభ్యులు, బంధువులు అంత్యక్రియలకు ఏర్పాట్లు చేస్తున్న సమయంలో ఒక్కసారిగా భర్త ఏసన్న కుప్ప కూలిపోయాడు. కుటుంబసభ్యులు ఆసుపత్రికి తరలించేందుకు ప్రయత్నిస్తుండగా మృతి చెందాడు. ఒకే రోజు దంపతులిద్దరూ కొద్ది సమయంలోనే మృతిచెందడంతో కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఈ ఘటన గ్రామస్తులను కంటతడి పెట్టించింది.

డెంగీ నివారణకు పటిష్ట చర్యలు తీసుకోవాలి

కర్నూలు(హాస్పిటల్): డెంగీ వ్యాధి నివారణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని మలేరియా జోనల్ అధికారి డాక్టర్ సరస్వతి, ఎంపీహెచ్ఈఓ నిత్య పూజయా ఆదేశించారు. సోమవారం వారు డెంగీ కేసులు నమోదైన కర్నూలులోని ముజఫర్‌నగర్, శ్రీరామనగర్‌లలో పర్యటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కర్నూలు అర్బన్‌లో 78, గ్రామాల్లో 174 డెంగీ కేసులు నమోదయ్యాయని, ఆయా ప్రాంతాల్లో మలేరియా అధికారులు ఎలాంటి చర్యలు తీసుకున్నారని ఆరా తీశారు. కేసులు వచ్చిన చోట యాంటీ లార్వా ఆపరేషన్, ఫాగింగ్ చర్యలు తీసుకున్నారా అని ప్రశ్నించారు. లార్వాలు ఉన్న చోట ఆబిట్ మందును పిచికారి చేయాలని చెప్పారు. వారి వెంట అసిస్టెంట్ మలేరియా అధికారి చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

టీబీ డ్యాం సమాచారం



పూర్తి మట్టం	:1,633 అడుగులు
ప్రస్తుతం	:1,628.65
టీఎంసీల సామర్థ్యం	:105,788
ప్రస్తుతం	:89,081
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	:8,651
ఔట్‌ఫ్లో (క్యూసెక్కులు)	:10,302

బయోపెస్టిసైడ్స్ దుకాణాలపై విజి'లెన్స్'

కర్నూలు: జిల్లాలోని దేవనకొండ, ఆస్పరి, కల్లూరు ప్రాంతాల్లోని బయో పెస్టిసైడ్స్ దుకాణాల్లో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు విస్తృత తనిఖీలు నిర్వహించారు. దేవనకొండలోని రవికిరణ్ ట్రేడర్స్‌లో అనధికార స్థలంలో పెస్టిసైడ్స్ నిల్వ ఉంచినందున రూ.4.34 లక్షల విలువచేసే పురుగు మందులను సీజ్ చేశారు. అలాగే బయో స్టిములెంట్స్‌నకు జి 2 ఫారాలను సమర్పించనందుకు రూ.8.86 లక్షల విలువ గల స్టాక్‌ను తాత్కాలిక నిలుపుదలకు ఆదేశాలు ఇచ్చారు. ఆస్పరి సాయి పెస్టిసైడ్స్‌లో సరైన ఇన్‌వాయిస్ బిల్లులు చూపనందుకు రూ.8,520 విలువ చేసే మందులను సీజ్ చేశారు. కల్లూరు భాగ్యలక్ష్మీ ఏజెన్సీ, విజయలక్ష్మి ట్రేడర్స్‌లో జి2 ఫారం సమర్పించనందున రూ.39 వేల విలువ చేసే మందుల విక్రయాలను తాత్కాలికంగా నిలుపుదల చేశారు.

'లా' రివాల్యుయేషన్ ఫలితాలు విడుదల

కర్నూలు (న్యూసిటీ): రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలో జరిగిన 'లా' (ఎల్ఎల్‌బీ) 3, 5 సంవత్సరానికి సంబంధించిన 3, 5, 9 సెమిస్టర్ పరీక్షల రీవాల్యుయేషన్ ఫలితాలను విడుదల చేసినట్లు ఉపకులపతి ఆచార్య ఎ.ఆనందరావు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొనారు. మూడవ ఏడాది 3 సెమిస్టర్‌లో 195 మందికి గాను 101 మంది, 3 సంవత్సరం 5 సెమిస్టర్‌లో 173 మందికిగాను 136 మంది, 5 ఏడాది 3 సెమిస్టర్‌లో 43 మందికి గాను ఇద్దరు, 5 సంవత్సరం 9 సెమిస్టర్‌లో 94 మందికి గాను 65 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని వీసీ ఎ.ఆనందరావు తెలిపారు.

కిరాణ దుకాణాల్లో అధికారుల తనిఖీలు

డోన్ టౌన్: పట్టణంలోని పలు కిరాణ దుకాణాల్లో సోమవారం జిల్లా ఫుడ్ అండ్ సేఫ్టీ అధికారి కాశీంవలి, డోన్ తూనికలు కొలతల అధికారి ఖాజా హుస్సేన్ ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. పట్టణంలోని రైల్వే స్టేషన్ రోడ్‌లోని మురారి రవి, పవనసుధ, కంభాలపాడు రోడ్డులోని చిల్యాల శ్రీను, కామాక్షి ట్రేడర్స్ తదితర కిరాణా షాపులతో పాటు మరి కొన్ని దుకాణాల్లో తనిఖీలు చేపట్టి శ్యాంపుల్స్ సేకరించారు. తనిఖీల విషయం తెలుసుకున్న కొందరు కిరాణం దుకాణ యజమానులు షాపులను మూసివేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా ఒకే రోజు దాడులు నిర్వహించినట్లు తెలిపారు. గత వారం ఆయిల్ దుకాణాలపై దాడులు చేశామని, ప్రస్తుతం కిరాణ దుకాణాల్లో తనిఖీలు చేసి నాణ్యత ప్రమాణాలను పరిశీలించినట్లు తెలిపారు.

సాక్షి
ఫ్యామిలీ
IV
కర్నూలు
మంగళవారం ॥ 15-8-2023

ఆగస్టు 15

ఆమె... దేశంలో సగం ఎప్పుడు!?

**స్వాతంత్య్ర దినోత్సవం
దేశ ఔన్నత్యాన్ని మాట్లాడుతుంది.
దేశ ఉజ్వల భవిష్యత్తును
కాంక్షిస్తుంది.
కాని దేశంలో సగమైన
స్త్రీలు సంపూర్ణ స్వాతంత్య్ర ఫలాలు
ఇంకా పొందవలసే వుంది.
ఏనాడైతే స్త్రీల పట్ల సురక్షితమైన,
సంస్కారవంతమైన ప్రవర్తనను
ఈ సమాజం చూపుతుందో
అప్పుడే స్త్రీలకు
సంపూర్ణ స్వాతంత్య్రం వచ్చినట్టు.
అప్పుడే దేశ ఔన్నత్యం ఇనుమడించినట్టు.
'ఆకాశంలో సగం'లాగా
దేశంలో సగం ఇంకెప్పుడు?**



నేడు ఆగస్టు 15న ఎర్రకోట మీద జెండా ఎగుర వేసే సమయంలో ప్రధాని నరేంద్ర మోడీకి ఇద్దరు మహిళా ఆర్మీ ఆఫీసర్లు సహకారం అందిస్తారు. మేజర్ నికితా నాయర్, మేజర్ జాస్మిన్ కౌర్ పతాకావిష్కరణ సమయంలో ప్రధానితో పాటుగా ఉండి జెండా వందనం సమర్పిస్తారు. ఈ విశేష ఘట్టంలో ఇద్దరు మహిళలకు ఈ విధంగా చోటు దక్కడం సంతోషపడాల్సిన సంగతి. 76 ఏళ్ల క్రితం స్వాతంత్య్రం వచ్చిన నాటి నుంచి నేటి వరకు స్త్రీల స్థితిగతుల్లో వచ్చిన పురోభివృద్ధికి ఇదీ ఒక సంకేతమే. నాటి నుంచి నేటి వరకు విద్య, ఉపాధి, ఉద్యోగం, సైన్యం, పాలనా యంత్రాంగం, శాసన వ్యవస్థ... వీటిల్లో స్త్రీలకు గణనీయంగా స్థానం దక్కింది. ప్రాముఖ్యం లభించింది. అయితే అంతమాత్రాన స్త్రీలు సంపూర్ణంగా స్వాతంత్య్ర ఫలాలు అనుభవిస్తున్నారా అనేది ప్రశ్న.

స్త్రీల త్యాగం

దాస్య భారతంలో జరిగిన స్వాతంత్య్ర పోరాటంలో ఎందరో స్త్రీలు పాల్గొన్నారు. అన్నింటికి మించి పురుషులు దేశం కోసం ప్రాణాలు అర్పించినా, జైళ్ల పాలైనా స్త్రీలు ధైర్యంగా ఇళ్లు నడిపి కష్టాలను ఈదారు. దేశ విభజన సమయంలో తీవ్ర హింసను ఎదుర్కొన్నారు. అంతెందుకు 1930 నాటికి దేశ వ్యాప్తంగా 30 వేల మంది స్త్రీలు స్వాతంత్య్ర పోరాటంలో ఏదో విధాన జైలు శిక్ష అనుభవిస్తున్నారని తెలిస్తే ఆశ్చర్యం వేస్తుంది. ఈ స్త్రీల పోరాటం చాలామటుకు చరిత్రలో నమోదు కాకుండానే కాలగర్భంలో కలిసిపోయింది. ఇప్పుడిప్పుడే నాటి వీర వనితల గాథలు వెలికి వస్తున్నాయి. ఇంత పోరాటం, త్యాగం చేసి స్త్రీల భాగస్వామ్యంతో తెచ్చుకున్న స్వాతంత్య్రంలో స్త్రీలు నిజంగా సంతోషంగా ఉన్నారా?

సురక్షితం కాని దేశం

'ఒక స్త్రీ అర్ధరాత్రి క్షేమంగా నడిచి వెళ్లినప్పుడే ఈ దేశానికి నిజమైన స్వాతంత్య్రం వచ్చినట్టు' అని గాంధీజీ ఏ ముహూర్తంలో అన్నారో కాని అలాంటి స్థితి నేటికీ రాకపోగా నానాటికీ తీసికట్టుగా తయారవుతోంది. ఎన్ని చట్టాలు చేసినా, శిక్షలు తెచ్చినా స్త్రీలను గౌరవించాలి, వారి ఆత్మగౌరవాన్ని కాపాడాలి అని మెజారిటీ సమాజం అనుకోవడం లేదు. 'నస్త్రీ స్వాతంత్య్ర మర్హతి' అనే భావన సమాజంలో ఆది కాలం నుంచి చొప్పించి ఉండటం వల్ల స్త్రీ చేసే ప్రతి పనిలో తప్పు ఎంచడం, అదుపు చేయడం, చులకనగా చూడటం, వివక్ష చూపడం, దండించడం ఆనవాయితీగా మారింది. పిల్లల పెంపకం దశ నుంచే స్త్రీలను గౌరవించడం నేర్పించడం లేదు. ఇంట్లో అమ్మాయిని ఒకలాగా, అబ్బాయిని ఒకలాగా పెంచడం వల్ల ఈ అబ్బాయిలు 'సమాజం'గా మారి స్త్రీ పాలిట బెడదగా మారుతున్నారు. తమ మాటకు ఎటువంటి తిరస్కారం చెప్పినా పురుషుడు శిక్షించేవాడై స్త్రీని చంపేందుకు వెనుకాడటం లేదు. స్త్రీకి ఒక అభిప్రాయం కలిగి ఉండే స్వాతంత్య్రం ఆమెకు ఎందుకు ఇవ్వడం లేదు?

స్త్రీలను ప్రేమ, మర్యాద, గౌరవాలతో కుటుంబం చూసుకోవాలి. అప్పుడు ఆ మర్యాద, గౌరవాలు సమాజంలోకి ఆటోమేటిక్‌గా వస్తాయి. కుటుంబం స్త్రీకి ఎలా రక్షణ ఇస్తుందో సమాజం కూడా స్త్రీకి అలా రక్షణ ఇవ్వాలనే పౌర శిక్షణ, సంస్కారం అవసరం. పురుషులు మాత్రమే కాదు స్త్రీలు కూడా కుటుంబం, సమాజం, దేశం కోసం గొప్పగా ఆలోచించగలరు. వారికి స్వేచ్ఛ, స్వాతంత్య్రం ఇచ్చి చూస్తే తెలుస్తుంది. అటువంటి వేకువలోకి దేశం ఉదయించాలని ఈ స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా కోరుకుందాం.



● ఫ్రీడమ్ ఫిల్లింగ్ స్టేషన్, శిక్ష(ణ)లో ఉన్న మహిళలే నిర్వాహకులు

77వ స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా...

ఆల్ ఉమెన్ పెట్రోల్ బంక్

కారాగారంలో గడిపే సమయం శిక్ష సమయం కాదు, శిక్షణ సమయం. కారాగారం మానసిక పరివర్తన దిశగా శిక్షణ ఇచ్చే ప్రదేశం. శిక్ష పూర్తయి విడుదలైన తర్వాత సమాజంలో గౌరవంగా జీవించడానికి అవసరమైన నైపుణ్య శిక్షణ కూడా ఇచ్చే ప్రదేశంగా ఉండాలి. అలాగే ఉంటాయి కూడా. అయితే ఈ ఏడాది దేశం మరో అడుగు ముందుకేసింది. శిక్ష అనుభవిస్తున్న మహిళలకు ఉపాధి అవకాశాలను జైలు గోడల మధ్య కాకుండా సమాజంలో కల్పించడం ఈ స్వాతంత్య్ర దినోత్సవం ప్రత్యేకత.

చెన్నై నగర శివారులో అంబత్తూరు– పుఝల్ రోడ్డులో ఉన్న ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంకు 'ఆల్ ఉమెన్ పెట్రోల్ బంక్' అనే ప్రయోగాత్మకమైన సంస్కరణకు వేదికైంది. పుఝల్ మహిళల కారాగారంలో శిక్ష అనుభవిస్తున్న మహిళల్లో ముప్పై మందికి ఉద్యోగం ఇచ్చింది. దేశంలో ఇదే మొదటి ప్రయత్నం. ఈ ప్రయత్నంతో ఈ పెట్రోల్ బంకు ఫ్రీడమ్ ఫిల్లింగ్ స్టేషన్ అనే గౌరవ సూచికకు అర్హత సాధించింది. ఉదయం ఆరు గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు పన్నెండు గంటలు మహిళలు విధులు నిర్వర్తిస్తారు. ఆ తర్వాత పురుష ఖైదీలు విధుల్లోకి వస్తారు.

ఖైదీలు తమ శిక్ష కాలం పూర్తయిన తర్వాత సమాజంలో గౌరవంగా జీవించడం కోసం రకరకాల వృత్తుల్లో శిక్షణ ఇస్తారు. అవన్నీ జైలు గోడల మధ్యనే ఉంటాయి. మారుతున్న సమాజానికి తగినట్లు కొత్త కొత్త ఉపాధి మార్గాలకు తగిన ఏర్పాట్లు ఉండవు. అందుబాటులో ఉన్న పనుల్లోనే శిక్షణ ఇవ్వడమే జరిగేది. ఇదిలా ఉంటే... జైళ్లలో మహిళా ఖైదీలకు తగిన సౌకర్యాల పర్యవేక్షణ కోసం అన్ని రాష్ట్రాల్లో పర్యటించిన మహిళా కమిషన్ సభ్యుల పరిశీలనలో కొత్త విషయాలు తెలిశాయి. జైలు గోడల మధ్య ఉండడం వల్ల మహిళలు మానసికంగా కుంగుబాటుకు లోనవుతున్నారని, వారికి సమాజంలో భాగస్వామ్యం కల్పించాలని సూచించడంతో, ఆ సూచనను అందుకున్న జైలు అధికారుల్లో మొదటగా పుఝల్ జైలు అధికారులు ఈ ప్రయత్నం చేశారు. మహిళలకు పెట్రోల్ పట్టడంలో శిక్షణ ఇవ్వడంతోపాటు వినియోగదారులతో మాట్లాడడం, ఉద్యోగానికి తగిన ప్రవర్తనా నియమావళిలో కూడా మహిళలకు శిక్షణ ఇప్పించారు.

పెట్రోల్ బంకులో విధులు నిర్వర్తిస్తున్న మహిళలు తమకు స్వాతంత్య్రం వచ్చినట్లు సంతోషిస్తున్నారు. శిక్ష కాలాన్ని ఆనందంగా పూర్తి చేస్తామని, పరిపూర్ణమైన వ్యక్తిత్వంతో సమాజంలోకి విడుదలవుతామని చెప్పారు.

> **శిక్ష కాలం సమాజంలోనే!**
> శిక్షణ కాలంలో మారుతున్న కాలానికి అనుగుణంగా సంస్కరణలు తీసుకురావడంతోపాటు ఖైదీలను సమాజంతో అనుసంధానం చేయడం, వారి పునరావాసం కోసం పని చేయడం కూడా అవసరమే. ఆ అవసరాన్ని గుర్తించి మహిళలతోనే ముందడుగు వేసింది జైళ్ల శాఖ. శిక్ష సమయంలో కూడా సమాజంలో మనుషులతో మాట్లాడుతూ ఉంటే మానసికంగా ఆరోగ్యంగా ఉంటారు. సమాజానికి దూరంగా ఉన్నామనే ఆవేదన దూరమవుతుంది. సమాజంలోనే నివసిస్తున్న భావనతో జీవిస్తారు.

స్వాతంత్య్రాన్ని ఇలా ఎంజాయ్ చేయండి!



నేటి టెక్నాలజీ యుగంలో స్వాతంత్య్ర దినోత్సవాన్ని హాలిడేగా తీసుకుని ఆనందించే వారే ఎక్కువ. స్కూలు, కాలేజీ విద్యార్థులైతే జెండా వందనం తరువాత ఇంటికెళ్లిపోవచ్చు అని తెగ సంబరపడిపోతుంటారు. కానీ డెబ్బై ఆరేళ్లగా విరామం లేకుండ జరుపుకొంటూ నేడు 77వ వసంతంలో అడుగు పెట్టాం. దేశాన్ని పాలించే అధికారులు అధికారికంగా ఈ వేడుకలు జరిపిస్తున్నారు. బాధ్యతగల పౌరులుగా మనం ఇలా సెలబ్రేట్ చేసుకుందాం....

● ఉదయాన్నే ఎర్రకోటపై జరిగే జెండావందనం, వివిధ కార్యక్రమాలను టీవీలో చూడాలి. డెబ్బై ఏడేళ్ల స్వాతంత్య్ర భారతం ఎంత ఎత్తుకు ఎదిగిందన్న అంశాలను ప్రత్యక్ష ప్రసారాలు చూడడం ద్వారా తెలుసుకోవచ్చు ● తరువాత ఎప్పటి నుంచో అనుకుంటున్న ప్లేసుకి ఈరోజు వెళ్లండి. ఒక రోజులో వెళ్లిరాగల ప్రాంతానికి వెళ్లి అక్కడ గడిపి మీ ఒత్తిడిని దూరం చేసుకోండి. అక్కడ స్వతంత్ర దినోత్సవాన్ని గుర్తుండిపోయేలా గడపండి. ● రోజూ వేసుకునే దుస్తులు కాకుండా భారతీయ సంప్రదాయం ఉట్టిపడేలాంటి దుస్తులు ధరించండి. వీలైనంత వరకు డ్రెస్‌లో తెలుపు, కాషాయం, ఆకుపచ్చని రంగులు ఉండేలా చూసుకుని వేసుకోవాలి. అప్పుడు త్రివర్ణ పతాకానికి మరింత వన్నె తెచ్చిన వారవుతారు ● ఎక్కడికీ వెళ్లే ఓపిక లేనప్పుడు ఇంట్లోనే ఉండి దేశభక్తి సినిమాలు చూడండి. మీతోపాటు మీ పిల్లలకు మన దేశ చరిత్ర, ఔన్నత్యాలు తెలుస్తాయి ● మరింత ఉత్సాహంగా సెలబ్రేట్ చేసుకోవాలంటే మూడు రంగులు ఉండేలా వెరైటీ డిష్‌లు తయారు చేసుకుని తినండి ● స్వాతంత్య్ర దినోత్సవం అర్థం ఉట్టిపడేలా గాలిపటాలు ఎగరవేయండి. మూడు రంగుల్లో ఉన్న గాలిపటాలను వీలైనంత ఎత్తుకుఎగరేస్తూ మనకొచ్చిన స్వేచ్ఛను ఎంజాయ్ చేయవచ్చు ● పుస్తకాల పురుగులు అయితే దేశభక్తి పుస్తకాలను చదవండి. స్వాతంత్య్ర సమర యోధుల విజయగాథలు, వీరిలో బాగా పాపులర్ అయిన నాయకుల బయోగ్రఫీని చదివి ఎన్నో విషయాలు తెలుసుకోవచ్చు ● దేశభక్తి గీతాలు వింటూ కూడా సంబరాలు జరుపుకోవచ్చు. అలనాటి పోరాట, అసామాన్య త్యాగాలను గుర్తుచేసే పాటలను వినాలి. లతా మంగేష్కర్, మహ్మద్ రఫీ, ఏఆర్ రెహ్మాన్ పాటలు మనలో నిద్రపోతున్న దేశభక్తిని తట్టి లేపుతాయి ● ఇంటి చుట్టుపక్కల వారు లేదా బంధువులు, కుటుంబ సభ్యులతో దగ్గరలో జరుగుతోన్న జెండా పండుగకు వెళ్లి రెపరెపలాడే త్రివర్ణ పతాకానికి జైహింద్ కొట్టాలి ● దేశానికి పెద్ద సేవ చేయలేక పోయినప్పటికీ మీ చుట్టుపక్కల ఉన్న వారందరికి స్వీట్లు పంచి, నోరు తీపి చేస్తూ స్వతంత్ర దినోత్సవ వేడుకలు జరుపుకోండి.

ప్రతి భారతీయుడికి ఎంతో విలువైన బహుమతులు స్వేచ్ఛా స్వాతంత్య్రాలు. అందుకే వీలైనంత వరకు అందరితో కలిసి జరుపుకోవాల్సిన జెండా పండుగ ఇది. సెలవు దొరికింది అని సంబరపడిపోక వీటిలో ఏ ఒక్కదాన్ని పాటించినా స్వాతంత్య్ర దినోత్సవాన్ని గౌరవించినట్లే

జీవన సేద్యం!

● పెద్ద కమతాల్లో సేంద్రియ వరి సేద్యంలో జీవన ఎరువులు/పురుగుమందులు కీలకం



● వ్యవసాయ క్షేత్రంలో సిద్ధమవుతున్న జీవన ఎరువులు

సేంద్రియ వరి సాగులో చిన్న, పెద్ద రైతులకు అనువైన ఉత్పాదకాల పట్టిక

వివరణ	చిన్న రైతులకు అనువైన ప్రాచీన పద్ధతులు	పెద్ద రైతులకు అనువైన ఆధునిక పద్ధతులు
1వ రోజు విత్తనశుద్ధి	బీజామృతంతో విత్తన శుద్ధి చేయాలి	హ్యూమిక్ యాసిడ్, బవేరియా, మెటారైజియం, సూడోమోనాస్
10వ రోజు పిచికారీ	జీవామృతం + పంచగవ్య + పుల్ల మజ్జిగ	మీనామృతం + సూడోమోనాస్+ తౌడు కషాయం
12వ రోజు ఎరువు	ఘనజీవామృతం	ఘనజీవామృతం / వర్మీకంపోస్టు + హ్యూమిక్ ఆసిడ్
20వ రోజు సస్యరక్షణ	ఆగ్నేయ అస్త్రం + జీవామృతం + మొలకల ద్రావణం	మీనామృతం + బేవేరియా, మెటారైజియం + వెర్టిసీలియం పిచికారీ చేయాలి.
ఊడ్పు అనంతరం 22వ రోజు స్ప్రే	పంచగవ్య + అగ్ని అస్త్రం + పుల్ల మజ్జిగ	మీనామృతం+బవేరియా +మెటారైజియం+ వెర్టిసీలియం + కొబ్బరి నీరు పిచికారీ చేయాలి. కాండం తొలిచే పురుగుకు ల్యూర్ పెట్టాలి లేదా ట్రైకోగ్రామా కార్డులు పెట్టాలి లేదా తూజా 200 (హోమియో) పిచికారీ చేయాలి.
25వ రోజు ఊడ్పు	ఘనజీవామృతం 1 టన్ను / 1 ఎకరం + వేప పిండి 200 కిలోలు/ఎకరం	ఘనజీవామృతం 1 టన్ను/ 1ఎ + బ్యాక్టీరియాలు, ఎన్‌పికె, బవేరియా, మెటారైజియం బాక్టీరియాలు.
25 రోజులకు	కలుపు తీయాలి.	కలుపు తీయాలి.
35 రోజులకు	మొలకల ద్రావణం + ఆగ్నేయ అస్త్రం + ఇంగువ కషాయం లేదా పుల్ల మజ్జిగ పిచికారీ చేయాలి.	మీనామృతం, సోయాబీన్, పెసలు మొలకల ద్రావణం, సూడోమోనాస్, బవేరియా, మెటారైజియం, వెర్టిసీలియం పిచికారీ చేయాలి.
40 రోజులకు	కలుపు తీయాలి.	కలుపు తీయాలి.
45 రోజులకు	మొలకల ద్రావణం + వేప గింజల కషాయం	మీనామృతం + నేల వేము కషాయం + ఉలవల కషాయం
45 రోజులకు	ఘనజీవామృతం 500 కిలోలు/1 ఎకరం	ఘనజీవామృతం 500 కిలోలు / 1 ఎకరం
65వ రోజు పిచికారి	మొలకల ద్రావణం + ఇంగువ కషాయం + పసుపు దుంపల కషాయం + ఆగ్నేయ అస్త్రం	మీనామృతం + సూడోమోనాస్ + వెర్టిసీలియం + వావిలాకు కషాయం
80వ రోజు పిచికారీ	మొలకల ద్రావణం + పుల్ల మజ్జిగ + దశపర్ణి కషాయం	మీనామృతం + సూడోమోనాస్ + వెర్టిసీలియం + బవేరియా

సేంద్రియ/ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో ద్రావణాలు, కషాయాలను చిన్న, సన్నకారు రైతులు తయారు చేసుకొని వాడగలుగుతున్నారు. అయితే, ఎక్కువ విస్తీర్ణంలో సేంద్రియ/ప్రకృతి సేద్యం చేసే పెద్ద రైతులకు వీటి తయారీ కష్టం కావటంతో జీవన ఎరువులు, జీవన పురుగుమందులను విరివిగా వినియోగిస్తున్నారు. రైతు శాస్త్రవేత్త, తునికిలోని ఏకలవ్య కేవీకే సలహాదారు, హార్ట్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఎం.ఎస్.సుబ్రహ్మణ్యం రాజు గత కొన్ని సంవత్సరాలుగా చిన్న, పెద్ద కమతాల్లో సాగు చేసే రైతులతో కలసి పనిచేస్తున్నారు. ఖరీఫ్/లేటు ఖరీఫ్ వరి సాగులో చిన్న కమతాల రైతులు, పెద్ద కమతాల రైతులు ఏయే ఉత్పాదకాలను, ఎంతెంత మోతాదులో వాడితే మంచి ఫలితాలు వస్తున్నాయన్న అంశాలను ఆయన 'సాక్షి సాగుబడి'కి ఇలా వివరించారు.

వరి నారుమడిని నీరు నిలవని విధంగా తయారు చేసుకోవాలి. విత్తనాన్ని ఒక రోజు ముందు ఎండబెట్టి మరునాడు విత్తన శుద్ధి చేయాలి. నిద్రావస్థ ఉన్న విత్తనాలను, నిద్రావస్థ తొలగించడానికి గోరువెచ్చని నీటిలో నానబెట్టి, అనంతరం విత్తనాలను నారుమడిపై వెదజల్లాలి. 2వ రోజు నీరు బయటకు తీయాలి. 5వ రోజు నీరు పెట్టాలి. తర్వాత తగినంత నీరు ఇస్తుండాలి. చాలా ప్రాంతాల్లో నారు 6 అంగుళాల సైజు నుంచి 10 అంగుళాల సైజు వచ్చినప్పుడు మాత్రమే ఊడ్పు/నాట్లు వేస్తుంటారు. నాట్లు వేసిన 7 రోజులకు.. చనిపోయిన మొక్కల స్థానంలో మళ్లీ నాట్లు వేయాలి.

ప్రధాన పొలాన్ని ఊడ్పుకు ముందు 20 రోజుల నుంచి దఫ దఫాలుగా వారానికి ఒకసారి దుక్కి దున్ని, చదును చేసుకోవాలి. ఎకరాకు 3 నుంచి 5 టన్నుల పశువుల ఎరువు వెయ్యాలి. నాట్లతో పాటుగా వివిధ రకాల జీవన ఎరువుల (బ్యాక్టీరియాల)ను ఇవ్వాలి. మొక్కల మధ్య 20 సెం.మీ. దూరం ఉండేలా వరి నాట్లు వేయాలి. మధ్యలో కాలి బాటలు తీయాలి. గట్లపై నువ్వుల విత్తనాలను చల్లుకుంటే నువ్వుల పువ్వులు ఎనాగరస్ అనే కీటకాన్ని ఆకర్షించటం ద్వారా తెల్లదోమ నివారణ జరుగుతుంది.



● జీవామృతం

మోతాదు ఎంత?

● ఎకరం పంటకు సగటున 100-120 లీ. నీటిని పిచికారీ చేయాలి ● మీనామృతాన్ని నారుమడిపై లీ. నీటికి 5 ఎం.ఎల్., పైరు ఎదిగిన దశలో లీ. నీటికి / 10ఎం.ఎల్. చొప్పున కలిపి పిచికారీ చేయాలి ● బవేరియాను లీ. నీటికి /10 గ్రా. కలిపి పిచికారీ చేయాలి ● మెటారైజమ్ లీ. నీటికి/10 గ్రా. వాడాలి ● హ్యూమిక్ యాసిడ్ కిలో విత్తనాలకు/10 గ్రా. వాడాలి. ● కిలో నేల వేము పొడిని 100 లీ. నీటిలో కలిపి కషాయం తయారు చేయాలి ● 1500 గ్రా. వావిలాకు పొడిని కషాయం చేసుకొని 100 లీ. నీటిలో కలిపి పిచికారీ చేయాలి ● ఎకరానికి రకానికి ఒక కిలో చొప్పున జీవన ఎరువులు వాడాలి ● లీ. నీటికి 10 ఎం.ఎల్. కొబ్బరి నీరు కలపాలి ● పంచగవ్య నారుమడిలో పిచికారీకి లీ. నీటికి 5 ఎం.ఎల్. కలపాలి. పైరు ఎదిగే దశలో పిచికారీకి లీ. నీటికి 20 ఎం.ఎల్. కలపాలి ● అర కేజీ ఇంగువతో ద్రావణం చేసుకొని వంద లీ. నీటిలో కలిపి పిచికారీ చేయాలి ● 200 గ్రా. పసుపును కషాయం చేసుకొని వంద లీ. నీటితో కలిపి పిచికారీ చేసుకోవాలి ● 2 కిలోల మొలకలతో ద్రావణం చేసుకొని వంద లీ. నీటితో కలిపి పిచికారీ చేసుకోవాలి ● 6 లీ. పుల్ల మజ్జిగను వంద లీ. నీటితో కలిపి పిచికారీ చేయాలి. ● ఆగ్నేయ అస్త్రం తయారీలో మిర్చి, అల్లం, వెల్లుల్లిలను అర కిలో చొప్పున తీసుకొని నూరి కషాయం తయారు చేసి వంద లీ. నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

(ఇతర వివరాలకు.. సుబ్రహ్మణ్యం రాజు మొబైల్: 76598 55588)

నిర్వహణ: పంతంగి రాంబాబు, సాగుబడి డెస్క్

సాగుబడి
అశ్లేష కార్తె: ఆగస్టు 17 వరకు
మఖ: 18 నుంచి

ఎడారిలో ఆశల మొలక



● థార్ ఎడారిలో సాగవుతున్న మొలకగడ్డి

ప్రపంచంలోనే అత్యధిక పాలను ఉత్పత్తి చేస్తున్న మన దేశంలో పచ్చిగడ్డి లభ్యత 11 శాతం తక్కువగా ఉందని భారతీయ గడ్డి నేలలు, పశుగ్రాస పరిశోధనా సంస్థ లెక్కగట్టింది. భూతాపం ప్రమాదకరమైన రీతిలో పెరుగుతున్న ప్రస్తుత కాలంలో పచ్చిగడ్డి సాగుకు హైడ్రోపోనిక్స్ పద్ధతి చక్కని ప్రత్యామ్నాయంగా మారుతోంది. ఈ పద్ధతిలో తక్కువ స్థలంలో, పది శాతం నీటితోనే ఏడాది పొడవునా మొలక గడ్డిని పెంచుకోవచ్చు. మొలక గడ్డిని పాడి ఆవులు, గొర్రెలు, మేకలకు మేపటం మన రాష్ట్రాల్లోనే కాదు.. రాజస్థాన్‌లోని థార్ ఎడారి ప్రాంత పశుపోషకులను సైతం ఆకర్షిస్తోంది. అక్కడ ఏడాదిలో రెండు నెలలే వర్షం పడుతుంది. మండు వేసవిలో ఎండ వేడి 120 డిగ్రీల సెల్షియస్‌కు చేరుతుంటుంది. అటువంటి క్లిష్ట పరిస్థితుల్లో జీవించే థార్ ప్రాంత రైతులు, సంచార పశుపోషకులు స్వచ్ఛంద సంస్థలు, స్టార్టప్‌ల తోడ్పాటుతో ఇటీవల హైడ్రోపోనిక్ మొలక గడ్డి సాగు చేపట్టారు. సునాయాసంగా నాణ్యమైన పాల దిగుబడితో పాటు ఆదాయాన్ని పెంచుకుంటున్నారు.



● మొలకగడ్డి వేస్తున్న మహిళారైతు పలు హేమారామ్

స్వచ్ఛంద సంస్థలు, స్టార్టప్‌లు ఎడారి ప్రాంత రైతులు, పశుపోషకుల కోసం హైడ్రోపోనిక్ మొలక గడ్డిని పెంచే షెడ్లను నెలకొల్పుతున్నాయి. రైతులే వాటిలో మొక్కజొన్నలు, గోధుమలను నానబెట్టి, వర్టికల్ గార్డెన్ మాదిరిగా అనేక దొంతర్లలో ఏర్పాటు చేసిన ప్లాస్టిక్ ట్రేలలో మొలక గడ్డిని పెంచుతున్నారు. సాధారణంగా పొలంలో పచ్చిగడ్డిని పెంచడానికి 2 నెలలు పడుతుంది. మొలక గడ్డి 8 రోజుల్లో పెరుగుతుంది. ముఖ్యంగా పది శాతం నీటితోనే ఈ గడ్డి పెరగటం థార్ ఎడారి ప్రాంత రైతులు, పశుపోషకులకు ఉపయుక్తంగా మారింది.

స్వచ్ఛంద సంస్థ ఉర్ముల్ సీమంత్ సమితి, డిజర్ట్ రిసోర్స్ సెంటర్‌తో కలసి హైడ్రోగ్రీన్స్, బహుళ నేచురల్స్ స్టార్టప్‌లు మొలక గడ్డి ఉత్పత్తి యూనిట్లను థార్ ఎడారి గ్రామాల్లో ఏర్పాటు చేస్తుండటంతో కొందరు మహిళా రైతులు హాయిగా ఊపిరిపీల్చుకుంటున్నారు. బహుళ నేచురల్స్ వీరి వద్ద నుంచి దేశీ ఆవు పాలను, ఒంటె పాలను సేకరించి, విలువ జోడించి ఆన్‌లైన్‌లో విక్రయిస్తోంది. వెయ్యి మంది పాడి రైతులు, 4 వేల మంది పశుపోషకులు తమ ఆవులు, మేకలకు మొలక గడ్డిని మేపుకుంటూ ఏడాది పొడవునా స్థిరమైన ఆదాయం పొందుతున్నారు.

పశుపోషణ కోసం గొడ్డు చాకిరీ చేసే మహిళా రైతులకు మొలక గడ్డి అందుబాటులోకి రావటం గొప్ప ఊరటనిస్తోంది. మొలక గడ్డి మేపుతో దేశీ ఆవు పాల దిగుబడి మూడింట ఒక వంతు పెరగడంతో పాటు, నాణ్యత కూడా పెరిగిందని రాజస్థాన్‌లోని ఘంటియాలి గ్రామానికి చెందిన దళిత మహిళా పశుపోషకురాలు 'పలు', ఆమె భర్త హెమారామ్ సంతోషంగా చెబుతున్నారు. వీరికి 8 ఆవులు, మేకలు ఉన్నాయి. 4 మైళ్ల దూరంలో ఉన్న పొలానికి వెళ్లి గడ్డి కోసుకొని, ఎండలో నెత్తిన పెట్టుకొని మోసుకు రావటం ఆమెకు కనాకష్టంగా ఉండేది. రెండేళ్ల క్రితం ఇంటి పక్కనే మొలకగడ్డి ఉత్పత్తి యూనిట్‌ను ఏర్పాటు చేసుకున్నాక ఆ బాధ తప్పింది. మిగులు గడ్డిని, గోధుమ గడ్డి పొడిని అమ్ముతూ ఆదాయం పొందుతుండటం విశేషం.

దూడలకు పెట్టే కాన్సంట్రేట్ మిక్చర్ దాణాను 75% తగ్గించి మొక్కజొన్న మొలక గడ్డిని మేపటం వల్ల మంచి ఫలితం కనిపించిందని బికనెర్ వెటరినరీ కాలేజీ ప్రొఫెసర్ డాక్టర్ ఆర్.కె. ధురియా అన్నారు. హైడ్రోపోనిక్ మొలక గడ్డి వల్ల మేకల్లో జీర్ణశక్తి, పెరుగుదల బాగుందని సౌదీ అరేబియాలోని కింగ్ సౌద్ యూనివర్సిటీ అధ్యయనంలో వెల్లడైంది. మొలకగడ్డి యూనిట్ ఏర్పాటుకు రూ. 18 లక్షల నుంచి 25 లక్షల వరకు ఖర్చవుతోంది. అయితే, ఇసుక తుపాన్లకు మొలకగడ్డి షెడ్లు దెబ్బతినటం వల్ల నష్టం జరుగుతోంది.

అందుకని, ముమ్ముందు షిప్పింగ్ కంటెయినర్లలో మొలకగడ్డి ఉత్పత్తి కేంద్రాలు ఏర్పాటు చేయటమే దీనికి పరిష్కారమని బహుళ నేచురల్స్ భావిస్తోంది. లక్షల ఖర్చుతో కూడిన పని కావటంతో రైతులను బృందాలుగా ఏర్పాటు చేసి మొలకగడ్డి యూనిట్లను నెలకొల్పితే మేలు. అయితే, రూ. 17.500 ఖర్చుతో చిన్నపాటి మొలకగడ్డి యూనిట్లు ఏర్పాటు చేసుకోవచ్చని హైడ్రోగ్రీన్స్ స్టార్టప్ చెబుతోంది.

బయోచార్‌తో సేంద్రియ ఇంటిపంటల సాగుపై శిక్షణ

సేంద్రియ ఇంటిపంటల సాగుపై పట్టణ/నగర వాసులపై ఆసక్తి పెరుగుతోంది. బయోచార్ (బొగ్గుపొడి) కలిపిన మట్టి మిశ్రమంతో టెర్రస్ గార్డెన్లు, పెరటి తోటలు, బాల్కనీలలో కూరగాయల పెంపకంపై ఈ నెల 24, 25 తేదీల్లో హైదరాబాద్ మలకపేటలోని న్యూలైఫ్ ఫౌండేషన్ శిక్షణ ఇవ్వనుంది. మిగులు పంట దిగుబడులను సోలార్ డ్రయ్యర్‌తో ఎండబెట్టే విధానం కూడా వివరిస్తామని న్యూలైఫ్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు శివ షిండే తెలిపారు. వివరాలకు.. 81210 08002.

17న అమలాపురంలో ప్రకృతి సేద్యంపై శిక్షణ

శ్రీనివాస సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ నెల 17న కోనసీమ జిల్లా అమలాపురంలోని (ముక్తేశ్వరం– కొత్తపేట రోడ్డు) శ్రీసత్యనారాయణ గార్డెన్స్‌లో ప్రకృతి వ్యవసాయంపై నిపుణులు విజయరామ్ రైతులకు అవగాహన కల్పిస్తారని నిర్వాహకులు నిమ్మకాయల సత్యనారాయణ తెలిపారు. ప్రవేశం ఉచితం. ముందుగా పేరు నమోదు చేసుకోవాలి. వివరాలకు.. 64091 11427 (సా. 3 గం. నుంచి 6 గం. వరకు మాత్రమే).